క్లుప్తంగా

అంతర్వేదిలో ఎమ్మెల్యే రాపాక పూజలు



అంతర్వేది స్వామివారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే వరప్రసాదరావు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి, నాయకులు కె.అశోక్, కె.వేణుప్రసాద్, ఆర్.వెంకట్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

25న కవితా గోష్టి

సఖినేటిపల్లి: మైసూరులో ఈ నెల 25న కన్నడ, తెలుగు కవితా గోష్టి జరుగుతుందని శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ గురువారం చెప్పారు. దీనికి తాను ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు తెలిపారు. మైసూరు కన్నడ పరిషత్ సౌజన్యంతో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ హాల్ వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో 100కి మంది పైబడి జాతీయ స్థాయి ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

శృతిబద్ధంగా నాదస్వరం అభ్యసించాలి

అంబాజీపేట: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలలో ప్రధానమైన నాదస్వరాన్ని నేటితరం శృతిబద్ధంగా నేర్చుకోవాలని కంచి కామకోటి పీఠం సమగ్ర పాఠశాలల కోఆర్డినేటర్ లక్ష్మి మాంధాత అన్నారు. ముక్కామలలో గత నెల 29న ప్రారంభించిన నాదస్వర పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంచి పీఠం ఆధ్వర్యంలో పురాతన కళల్లో ఒకటైన నాద స్వరాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ముక్కామలలో పీఠం ఆధ్వర్యంలో యజుర్వేద పాఠశాల, శైవాగమ పాఠశాలలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేకంగా నాదస్వర పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు వృత్తి విద్యతో పాటు సాధారణ విద్యను కూడా అందించాలని అన్నారు. నాదస్వర గురువులు ఉప్పలపాటి ఈశ్వరరావు, పసుపులేటి నాగబాబు, దువ్వూరి సోమయాజులు, పసుపులేటి కుమార్, శైవాగమ పాఠశాల నిర్వాహకుడు వెలవలపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



అంబాజీపేటలో లారీ ఢీకొనడంతో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

అంబాజీపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఓ విద్యుత్ స్తంభాన్ని లారీ బలంగా ఢీకొనడంతో ఒరిగిపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. లారీ వెనక్కి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఆ సమయంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. విద్యుత్ శాఖ ఏఈ ఎ.హరిబాబు తన సిబ్బందితో వచ్చి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

ముళ్ల పొదల్లో వ్యక్తి మృతదేహం

రావులపాలెం: స్థానిక సెయింట్ పాట్రిక్స్ విద్యా సంస్థల ఎదురుగా జాతీయ రహదారి పక్కన ముళ్ల పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై ఎం.వెంకటరమణ గురువారం తెలిపారు. మృతుడి వయసు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. నీలి రంగుపై ఎరుపు రంగు నిలువు గళ్లు కలిగిన ఫుల్ హ్యాండ్స్ షర్ట్, లేత పసుపు పచ్చ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు రావులపాలెం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

12 నుంచి శిక్షణ ప్రారంభం

కొత్తపేట: స్థానిక స్కిల్ హబ్ సెంటర్‌లో ఈ నెల 12 నుంచి అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు సంబంధించి శిక్షణ ప్రారంభమవుతుందని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సాధనాల మౌనిక తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకూ ఏదైనా డిగ్రీ పాసై 18 నుంచి 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కలిప్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని మౌనిక వివరించారు.

ఆనందమానందమాయె..

- కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- సీఎం జగన్ నిర్ణయంతో సంతోషం



కొత్తపేటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

కొత్తపేట: ఎన్నో ఏళ్ల కల నెరవేరింది.. కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాలకు కొత్త వెలుగు వచ్చింది.. ఉద్యోగాల క్రమబద్ధీకరణ నిర్ణయంతో అది సాకారం అయ్యింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభవార్త చెప్పడంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. 2014 ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని టీడీపీ ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని గాలికొదిలేసింది. వైఎస్సార్ సీపీ అధినేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో కాంట్రాక్ట్ ఉద్యోగుల అభ్యర్థనను విన్నారు. రెగ్యులరైజేషన్ చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం జగన్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఈ మేరకు కొత్తపేట సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, పి.గన్నవరం మండలాల పరిధిలో విద్యాశాఖ, మెడికల్ అండ్ హెల్త్, జ్యుడీషియల్, ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్‌లలో 133 మంది ఉద్యోగులు రెగ్యులర్ కానున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 346 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులకు సుమారు 200 మంది రెగ్యులర్ అవుతున్నట్టు ఆ సంఘ నాయకులు తెలిపారు. దీంతో సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ కార్యదర్శి చిక్కాల నరసింహం ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఇది శుభ పరిణామం



2014 జూన్ 2 నుంచి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం శుభ పరిణామం. కాంట్రాక్ట్ ఉద్యోగుల కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెరవేర్చింది. కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాటు రెగ్యులర్ ఉద్యోగులకూ సీఎం వరాలు ఇచ్చారు. 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు అభినందనీయం.

– మోటూరి రామారావు, ప్రెసిడెంట్, ఏపీ ఎన్జీఓ కొత్తపేట యూనిట్

బానిస బతుకులకు చరమగీతం



సుమారు 23 ఏళ్ల కాంట్రాక్ట్ అనే బానిస బతుకులకు చరమగీతం పాడుతూ జగనన్న ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. మా కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– చిక్కాల నరసింహం, కార్యదర్శి, రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్

మాటపై నిలబడిన నేత జగన్



సీఎం జగన్ మాటపై నిలబడిన నాయకుడు. నేను హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో 18 ఏళ్ల నుంచి ఎంపీహెచ్ఏగా పనిచేస్తున్నాను. కాంట్రాక్ట్ ఉద్యోగ సర్వీసులను రెగ్యులర్ చేస్తున్నట్టు ప్రకటించిన వెంటనే ఆనందానికి అవధులు లేవు. గత ప్రభుత్వంలో జీతాలు కూడా ఆరు నెలలకోసారి ఇచ్చేవారు. జగనన్న ప్రభుత్వంలో పెండింగ్ లేకుండా జీతాలు ఇస్తున్నారు.

– వి.లక్ష్మణరావు, ఎంపీహెచ్‌ఏ, ఊబలంక పీహెచ్‌సీ

ప్రతి నెలా జీతాలు



నేను మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో 21 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ ఏఎన్ఎంగా పనిచేస్తున్నాను. కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉండేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా జీతాలు తీసుకుంటున్నాం. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని జగనన్న దేవుడిలా ప్రకటించారు.

– జి.నాగమణి, ఏఎన్ఎం, మెడికల్ అండ్ హెల్త్, కొత్తపేట

నేరస్తులకు త్వరితగతిన శిక్షలు



డీఎస్పీ రమణ

అంబాజీపేట: నేరాలకు న్యాయస్థానాలలో త్వరితగిన శిక్షలు పడినప్పుడే క్రైం రేటు తగ్గుతుందని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ అన్నారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంచలనమైన కేసులు జరిగినప్పుడు జడ్జిలకు కేసు తీవ్రతలను ప్రత్యేకంగా వివరిస్తున్నామని, అందువల్ల నిందితులకు త్వరితగతిన శిక్షలు పడుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రహదారులు ఎక్కువగా సింగిల్ లైన్‌లో ఉంటాయన్నారు. జన సాంద్రత, వ్యక్తిగత వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తూ, ఈ చలనాలు విధిస్తుండటంతో కొంత మేర ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. ప్రస్తుతానికి అమలాపురంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. త్వరితగతిన డివిజన్ల వారీగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ..

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలో శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము గురువారం తెలిపారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

క్రీడల్లో సత్తా చాటాలి



నగరంలో క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. అప్పనపల్లికి చెందిన నవయువ క్రీడా యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో చదరంగంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే నగరంలో గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఇటీవల రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 12వ మినీ ఒలింపియాడ్ చదరంగం పోటీల్లో పతకాలు సాధించిన అప్పనపల్లికి చెందిన బొంతు హేమేష్‌నీల్, బొంతు భరత్, బొంతు గీతికావేణిలకు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలని సూచించారు. మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖల మండల సమాఖ్య కన్వీనర్ చిక్కం బుజ్జిబాబు, ఎంపీటీసీ సభ్యులు అంకాని వీరాంజనేయులు, బొంతు నీలిమ, కొండేటి వికాష్‌బాబు, బొంతు అరుణ, చందు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.61,617 విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందిస్తున్న అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి కృష్ణా జిల్లా నేలకొండపల్లికి చెందిన వెన్న శ్రీనివాసరావు, నాగలక్ష్మి దంపతులు గురువారం రూ.61,617 విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అధికారులు అందించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పూజలు

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం మాస కల్యాణాలు ఘనంగా జరిగాయి. ఆయా ఆలయాల వద్ద ఉదయం స్వామి వార్లకు సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాత పాతపాటి రమణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిత్యాన్నదానానికి రూ.20 వేల విరాళం

వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ అవరణలో నిత్యాన్నదాన పథకానికి ఆచంట మండలం కరుగొరుమల్లి గ్రామానికి చెందిన కంఠంశెట్టి సత్యకృష్ణ, లలిత నాగపూర్ణిమ దంపతులు రూ.20 వేల విరాళం సమర్పించారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

మలేరియా అంతానికి చర్యలు



జొన్నాడలో మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

ఆలమూరు: మలేరియా వ్యాధి నిర్మూలనకు అంతా సమష్టిగా కృషి చేద్దామని అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు నేతృత్వంలోని సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు మలేరియా నిర్మూలన మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మలేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నియమాలను వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, హెచ్‌వీలు పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



దేవరపల్లిలో ప్రధాన రహదారి నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు పడుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం దేవరపల్లిలో పలు ప్రభుత్వ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా సీఎం జగన్ పాలనను ప్రజల ముంగిటకే తెచ్చారన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా చాలా రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. ఈతకోట నుంచి కొత్తపేట వెళ్లే ప్రధాన రహదారిని నిర్మించుకున్నామని, దేవరపల్లి– మట్లదొడ్డి రహదారిని, మడికి గ్రామంలో రహదారికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అనంతరం గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయం–1 భవనం, రూ.21 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. రూ.5.20 లక్షలతో దేవరపల్లి కోసూరినగర్ రహదారిలోని శ్మశానవాటిక అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. గ్రామంలో రూ.80 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, మాజీ ఎంటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- రూ.కోటితో కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



ఆలమూరులో శెట్టిబలిజ కమ్యూనిటీ హాలుకు భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరులోని వైఎస్సార్ జగనన్న కాలనీ ఎదురుగా పెద్దకాలువ రోడ్డులో 50 సెంట్ల స్థలంలో రూ.కోటితో నిర్మించనున్న శెట్టిబలిజ కమ్యూనిటీ హాలుకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడారు. శెట్టిబలిజలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న కమ్యూనిటీ హాలు తమ ప్రభుత్వంలో రూపుదిద్దుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రైవేట్ కమ్యూనిటీ హాలుకు దీటుగా అత్యంత నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో శెట్టిబలిజల అండతో మరోసారి అధికారంలోకి వచ్చి మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమ చిరకాల వాంఛ నెరవేర్చిన ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డికి పార్టీల కతీతంగా మండల శెట్టిబలిజ సంఘీయులు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఆలయ కమిటీ చైర్మన్ వనుం సూరిబాబు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి గంగాభవానీ, ఎంఏఎస్ అధ్యక్షులు యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, ఎంపీటీసీ వున్నమట్ల విజయకుమారి, నాతి కుమార్‌రాజా, ఎలుగుబంటి బూరయ్య పాల్గొన్నారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆత్రేయపురం: సంపూర్ణ ఆరోగ్యానికి నడక అవసరమని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం గ్రామ మధ్యలోని మంచినీటి చెరువును అభివృద్ధి చేసి దాని చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి గ్రామస్తుల అభ్యర్థన మేరకు అల్లూరి సీతారామరాజు విగ్రహం పెడతామన్నారు. ఈ పనులను ఇటీవల రూ. కోటితో ప్రారంభించామని తెలిపారు. వీటిని ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. చెరువుకు సంబంధించి సర్వే చేపట్టాలని తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్‌కు తెలిపారు. ఆత్రేయపురం ప్రశాంతతకు పేరన్నారు. అలాంటి గ్రామంలో పార్కు నిర్మించి అందులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రుడా నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు వివరించారు. అవసరమైతే తమ సొంత నిధులు కూడా సమకూర్చుతామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మేడపాటి శ్రీనివాసరెడ్డి, కర్రి నాగిరెడ్డి, ఎంపీటీసీ చిలువూరి బాబిరాజు, ఆర్ఐ భవానీ, వీఆర్వో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నిరసిస్తూ ధర్నా

మామిడికుదురు: విద్యుత్ కోతలకు నిరసనగా జనసేన ఆధ్వర్యంలో మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వరరావుతో పాటు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ఎంపీటీసీ సభ్యులు కొమ్ముల జంగమయ్య, వాసంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 15 నాటికి నాట్లు పూర్తి చేయాలి

ఆలమూరు: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు చెందిన రైతులు వచ్చే నెల 15 నాటికి వరి నాట్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఏడీఏ కె.నాగేశ్వరరావు కోరారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ తొలి వారంలోనే తూర్పు డెల్టా ప్రధాన కాలువకు సాగునీరు విడుదల చేసినందున సత్వరమే ఖరీఫ్ పనులు ప్రారంభించాలన్నారు. గ్రామ సచివాలయ పరిధిలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 7,029 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు సొంతంగా తయారు చేసిన 1318 విత్తనాలను సాగు చేసుకుంటే పంటకు తెగుళ్ల బెడద ఉత్పన్నం కాదన్నారు. ఖరీఫ్‌కు ఎరువులు కొరత లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఒక్కొక్క రైతు భరోసా కేంద్రంలో సుమారు 20 టన్నులను అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు సందేహాలుంటే సత్వరమే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య, ఏఈఓ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

తల్లీ బిడ్డ ఆరోగ్య సంరక్షణకు సేవలు



ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కిల్కారీ రాష్ట్ర ఎస్‌పీఎం రాజు

రాజోలు: తల్లీ బిడ్డ ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం కిల్కారీ మొబైల్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందని కిల్కారీ రాష్ట్ర ఎస్‌పీఎం రాజు తెలిపారు. గురువారం రాజోలు మండల పరిషత్ సమావేశ హాలులో తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్ అధ్యక్షతన ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు కిల్కారీ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నాలుగు నెలల గర్భిణికి బిడ్డ పుట్టిన సంవత్సరం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీకాలు వంటి అంశాలను మొబైల్ నంబరుకు మెసేజ్‌లు, వాయిస్ మెసేజ్‌ల రూపంలో తెలియజేస్తారన్నారు. గర్భిణులు వినియోగించే సెల్ నంబర్‌ను ఆర్‌సీహెచ్ డేటాలో నమోదు చేయాలన్నారు. అలా నమోదు చేసిన సెల్ నంబర్‌కు మాత్రమే సందేశాలు వస్తాయన్నారు. ప్రతి వారం గర్భిణులకు సూచనలు, సలహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారన్నారు. పని ఒత్తిడిలో మొబైల్‌లో సందేశాలు వినకపోతే 14423 నంబర్‌కు కాల్ చేస్తే ఆ సందేశాలను మళ్లీ వినే అవకాశం కల్పించారన్నారు. కిల్కారీ సేవలను క్షేత్రస్థాయిలో తీసుకుని వెళ్లాలని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు సూచించారు. జిల్లా ఎన్‌హెచ్‌ఎం డీపీఓ రవికుమార్, సీహెచ్ఓ ఎలిజబెత్, సూపర్‌వైజర్ మద్దాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం



రమేష్, పల్సర్ ఝాన్సీలను సన్మానిస్తున్న శివకుమార్

మలికిపురం: స్థానికంగా గురువారం కళాకారులకు సన్మానం జరిగింది. మలికిపురం విచ్చేసిన డ్యాన్స్ మాస్టర్ రమేష్, పల్సర్ ఝాన్సీలను మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ శాలువాతో సత్కరించారు. విశాఖపట్నంలో డ్యాన్స్ అకాడమీ ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న రమేష్, ఝాన్సీలను అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దేవ దయానంద్, మోకా దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు వెండి ఛత్రం సమర్పణ



వెండి ఛత్రాన్ని ఆలయ కమిటీకి అందజేస్తున్న నరసింహారావు దంపతులు

మామిడికుదురు: స్థానిక గ్రామ దేవత నూకాలమ్మకు స్థానికులు రామేశ్వరపు నరసింహారావు దంపతులు వెండి ఛత్రాన్ని సమర్పించారు. అమ్మవారి గరగ పైభాగంలో ఏర్పాటు చేసే ఈ వెండి ఛత్రంను గురువారం ఆలయ కమిటీకి అప్పగించారు. వెండి గొడుగుకు సంప్రోక్షణ అనంతరం ప్రత్యేక పూజలు చేసి దానిని తల్లి గరగకు జతపర్చారు. దాత నరసింహారావు కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ అభినందించింది.

బూరుగులమ్మ జాతర

అంబాజీపేట: పుల్లేటికుర్రు గ్రామ దేవత బూరుగులమ్మ జాతరను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, కోయ డ్యాన్స్‌లు తదిత సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శుక్రవారం తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.